# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 22-09-2016**

కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధులు, అందాల్సిన సహాయం, అమలు చేయాల్సిన కార్యక్రమాల విషయంలో చొరవ చూపాల్సిందిగా ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయను కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాష్ట్ర ప్రజా ప్రతినిధులంతా రాజకీయాలకతీతంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు పోవడానికి కేంద్రం నుంచి అందాల్సిన పథకాలు, నిధులు, ఇతర సహాయం సకాలంలో రావాలని సిఎం అన్నారు. కేంద్ర ప్రభుత్వ అధికారులు, సహచర మంత్రులతో మాట్లాడి పెండింగ్ లో వున్న పనుల విషయంలో తగిన చొరవ చుపాలన్నారు.

ఢిల్లీలోని దత్తాత్రేయ నివాసంలో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు గురువారం ఆయనను కలిశారు. మంత్రి చందూలాల్, రాజ్యసభ సభ్యులు కె. కేశవరావు, డి. శ్రీనివాస్, లోక్ సభ నాయకుడు జితేందర్ రెడ్డి, ఎంపి వినోద్ కుమార్, ఇతర ఎంపీలు, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి వెంట వున్నారు.

కేంద్ర ప్రభుత్వం దగ్గర పెండింగ్ లో వున్న పనుల జాబితాను ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి అందించారు. వెనుకబడిన జిల్లాలకు అందాల్సిన రెండో విడత ఆర్థిక సహాయం విడుదలయ్యేలా చూడాలని కోరారు. రామగుండంలో ఫర్టిలైజర్ ప్లాంటు పునరుద్ధరణ ప్రధాన మంత్రి స్వయంగా శంఖుస్థాపన చేసినందున, వెంటనే పనులు ప్రారంభం అయ్యేలా చూడాలని కోరారు.

తెలంగాణ రాష్ట్ర ప్రతినిధిగా కేంద్ర మంత్రులతో మాట్లాడి పెండింగ్ పనులు త్వరగా జరిగేలా చూస్తానని దత్తాత్రేయ హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం పట్ల కేంద్రానికి సానుభూతి, ప్రేమ వున్నాయని ముఖ్యమంత్రి కె.

చంద్రశేఖర్ పట్ల ప్రధాని సహా కేంద్రంలో అందరికీ ప్రత్యేక అభిమానం, గౌరవం వున్నాయన్నారు. పార్లమెంటులో తెలంగాణ ఎంపీల వ్యవహారశైలిపై ప్రభుత్వానికి, స్పీకర్ కు సంతృప్తి వుందన్నారు. భారతదేశానికి సంబధించిన విధానపరమైన చర్చల్లో తెలంగాణ ఎంపీలు క్రియాశీలక పాత్ర పోషించడం అందరి మన్ననలు పొందిందని కేంద్ర మంత్రి ప్రశంసించారు.

రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం భేటీ

----------------------------

గోదావరి, ప్రాణహిత నదుల వెంట అటవీ ప్రాంతాల్లో నివసించే వారికి రహదారి సౌకర్యం కల్పించాలని, ముఖ్యంగా ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లోని ఐదు ప్రాంతాలకు రహదారి నిర్మాణం కోసం రూ.300 కోట్ల నిధులు గ్రామీణ రహదారి ప్రణాళిక (ఆర్.ఆర్.పి) కింద మంజూరు చేయాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ను కోరారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో గోదావరి, ప్రాణహిత నదుల వెంట జాతీయ రహదారి నిర్మాణానికి రూ.1290 కోట్లు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అన్ని అనుమతులు పొందిన ఈ రహదారి నిర్మాణ పనులకు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదముద్ర వేసేందుకు చొరవ చూపాలని సిఎం కోరారు. ఈ రెండు వినతులతో కూడిన పత్రాలను రాజ్ నాథ్ సింగ్ కు ముఖ్యమంత్రి అందచేశారు.

ముఖ్యమంత్రి వెంట ఎంపీలు కె. కేశవరావు, జితేందర్ రెడ్డి, బి.వినోద్ కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, సిఎం ముఖ్య కార్యదర్శి నర్సింగ్ రావు వున్నారు. గ్రామీణ రహదారుల పథకం కింద చేపట్టే పనులకు సంబంధించి అదనపు ప్రతిపాదనలను ముఖ్యమంత్రి గురువారం రాజ్ నాథ్ సింగ్ కు అందించారు.

కాళేశ్వరం నుంచి అర్జున్ గుట్ట వరకు రహదారి, కాళేశ్వరం వద్ద కిలోమీటర్ పొడవైన వంతెన (గోదావరి), రాచర్ల-పేమనపల్లి రహదారి, సోమిని – గూడెం రహదారి, గూడెం-బాబాసాగర్ రహదారుల నిర్మాణానికి రూ.300 కోట్లు మంజూరు చేయాలని సిఎం కోరారు. అటవీ ప్రాంతంలో వున్న ఈ ప్రాంతాలకు ఇతర ప్రాంతాలతో రాకపోకలు సాగించడానికి ఈ రహదారుల నిర్మాణం అత్యవసరమని సిఎం చెప్పారు.

ఖమ్మం జిల్లా భద్రాచలం (సారపాం) నుంచి ఆదిలాబాద్ జిల్లా కౌటాల వరకు గోదావరి, ప్రాణహిత వెంట జాతీయ రహదారి మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి... పనులు ప్రారంభించాలని కోరారు. ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదముద్ర త్వరగా వేసేలా చూడాలన్నారు.

**సిపిఆర్ఓ టు సిఎం**